


# సరళరేఖలు

జె. శ్యామల

నిర్జనమైన అడవి. దూరంగా ఓ గుడి. దాపుకెళ్ళాను. అది శివుడి గుడి. నా అడుగులు మననుకు లోబడి గుడి లోగిలిలోకి ముందుకు... ముందుకు ...నంది... పెద్ద నంది. ఎంత బాగుందో! శివలింగం మాట ఏమో కానీ ఈ నంది నా చూపు నతుక్కుపోయింది. ఏ శిల్పి ఉలి గిలిగింతలకు పులకరించి ఈ శిల నందిగా రూపుదాల్చిందో! ఆపేక్షగా నా చేయి నందిని తాకింది. అంతే! ఒక్కసారిగా కాళ్ళెత్తినుంచుంది. కనురెప్పపాటులో శిలలో కదలిక!

నా కనురెప్ప కదలిక మరచిపోయింది. అరక్షణం భయానికతీతమైన స్థితి. మరుక్షణం నిలువెల్లా భయం. అరవాలని ప్రయత్నం. కాని ఊడిరాని తాళంలా నా నోరు పనిచేయనని మొరాయించింది.

అరవలేను..కదల్లేను..భయం. భయం..ఎలా..ఎలా? ఎవరో నన్ను పట్టి కుదుపుతున్నారు. స్మృతి వస్తోంది.

"ఏమండీ..ఏమండీ"

నా శ్రీమతి నన్నింకా పట్టి కుదుపుతూ లేపుతోంది.

పారిపోబోతున్న కలను జ్ఞాపకం గుప్పిట వీలయినంతగా చిక్కించుకుంటూనే "ఎందుకూ లేపావ్" అసహనంగా అడిగాను.

"మీరేమిటో గమ్మత్తుగా మూలుగుతుంటే కంగారుపడి లేపాను. ఏమైంది మీకు? కలేమైనా వచ్చిందా?" అడిగింది సుమిత్ర.

"అవును. తమాషా కల" టూకీగా వివరించాను. అంతా విని "మీకిలాంటి అర్థంపర్థం లేని కలలు రావటానిక్కారణం అస్తమాను మీరు సమాధిలోకి వెళ్ళిపోవటమే" అందామె.

నేను ఆలోచనల్లో మునిగిపోవటానికి మా ఆవిడ పెట్టిన పేరు సమాధి.

"ఇవాళ వర్మగారింటికి వెళ్దామన్నారుగా" మంచినీళ్ళు అందిస్తూ అడిగింది.

"వూఁ" గ్లాసందుకుంటూ బదులిచ్చి మళ్ళీ సమాధిలోకి జారబడ్డాను.

"నిజానికి నాకిప్పుడు ఎటూ వెళ్ళాలని లేదు. కానీ ఆ మాట చెబితే సుమిత్రకు కోపం రావటం ఖాయం. నా అయిష్టానికి పెద్ద కారణమేమీ లేదు. ఎందుకో కొన్నిసార్లు కొన్ని పనులు చేయాలనిపించదు. అయినా సుమిత్రను నొప్పించకూడదనుకుంటే తప్పదు.

సుమిత్ర కాఫీ ఇచ్చి "తాగేసి తొందరగా తయారవండి" అంటూ అక్కడ నుంచి గబగబా వెళ్ళిపోయింది.

కమాండ్‌కో లోబడి కదిలే రోబోలాగా కప్పు ఖాళీ చేసి రిఫ్రెష్ అయి వచ్చి డ్రెస్ మార్చుకున్నాను.

సాదాగా ఉన్న నావైపు అదోలా చూసి "ఇక పదండి" అంటూ హెచ్చరించింది సుమిత్ర.

"పద" అంటూ చెప్పుల్లో కాళ్ళు దూర్చి ముందుక్కదిలాను.

****

వర్మ ఇల్లు దూరమే. బస్సులంటే సుమిత్రకు అసహ్యం. అందుకే ఆటో కేకేశాను. వచ్చి మా ముందు ఆగింది. ఎక్కడికి వెళ్ళాలో చెప్పి ఇద్దరం ఎక్కాం. ఆటో కదిలింది.

"వర్మ భార్య ఎక్కడో జాబ్ చేస్తోంది. ఈ ఆదివారం పూట మేం వెళ్ళటం వాళ్ళకు మిగిలే కాస్త విశ్రాంతిని కూడా మిగలకుండా చేస్తుందేమో! అలా అనుకుంటే నాకే ఇబ్బందిగా ఉంది.

ఆటో కుదుపులకు ఉలిక్కిపడ్డాను.

"మనిషి పక్కన ఉంటారన్న మాటే కానీ మాటా,

పలుకా! నా ఖర్మ!" సుమిత్ర సన్నగా విసుక్కుంటోంది.

"అరె! వర్మ ఇల్లు దాటిపోయాం"

"భాయ్! కొంచెం వెనక్కి తిప్పు"

ఆటో మళ్ళీ వెనక్కి తిరిగింది. "ఆ, ఆc ఇక్కడే ఆపు" దిగాను.

మీటరు చూసి డబ్బు ఇచ్చి గేటు తీసుకుని లోపలికి అడుగు పెట్టాను. నా వెంటే సుమిత్ర.

తలుపు తీసే వుంది. ముందుగది నిండా ఆట సామాన్లు చెల్లా చెదరుగా పడి ఉన్నాయి. వాళ్ళ బాబు కారు బొమ్మని పట్టుకొని పార్టులన్నీ విడగొడుతూ దాంతో గొడవపడుతున్నాడు. మరో మూల వాళ్ళ పాప పుస్తకంలో బొమ్మలకు స్కెచ్ పెన్నులతో రంగులు పులుముతోంది. చుట్టూ పెన్నులు, పెన్సిళ్ళు, కాగితాలు. వాళ్ళ ప్రపంచంలో వాళ్ళున్నారు. నాకీ క్షణంలో రెసిడెన్షియల్ స్కూల్లో ఉన్న మా పిల్లలు గుర్తుకు వస్తున్నారు. ఏం చేస్తుంటారో ఇప్పుడు సుమిత్ర కోరిక మీదే వాళ్ళనక్కడ చేర్చవలసి వచ్చింది. వచ్చే నిట్టూర్పును బలంగా ఆపుకున్నాను.

సుమిత్ర గాజుల చప్పుడుకు పాప తలెత్తి చూసింది. వెంటనే లోపలికి పరుగెత్తింది. వేం వచ్చామని చెప్పటానికే అనుకుంటా.

సరిగ్గా అంతే! ఎందుకంటే వెంటనే వర్మ భార్య బయటికి వచ్చి -

"రండి, రండి"అంటూ ఆహ్వానించింది. కుర్చీలను ఓ పక్కకు లాగుతూ -

"దీప్తీ! బొమ్మలన్నీ బుట్టలోకెత్తు" అంది పాపను ఉద్దేశించి.

కానీ పాప అక్కడ నుంచి కదల్లేదు.

"వర్మ లేడా!" అడిగాను.

"ఫోన్ చేయడానికి వెళ్ళారు. ఇప్పుడే వచ్చేస్తారు. కూర్చోండి" అంటూ తనే బొమ్మలు బుట్టలో సర్దేసింది.

ఇంతలో వర్మ రానే వచ్చాడు.

"హలో రావ్ ఇప్పుడేనా వచ్చింది" అంటూ తానూ ఓ కుర్చీలో బైఠాయించాడు.

మిసెస్ వర్మతో పాటు సుమిత్ర కూడా లోపలికి వెళ్ళింది. వేం లోకాభి రామాయణంలో పడ్డాం.

ఓ పావుగంట తర్వాత కాఫీ కప్పులతో మిసెస్ సుమిత్ర ముందు గదిలోకి వచ్చారు. కాఫీలు ముగించాం.

పిల్లల్ని దగ్గరికి పిలిస్తే రాలేదు. వాళ్ళకు కొత్త ఎక్కువట. నాకు పిల్లలంటే ప్రేమే కానీ ముద్దు చేసి, చేరదీయటం అంతగా రాదు. ఎక్కువగా సుమిత్ర, వర్మనే మాట్లాడుతున్నారు. నేనూ ఆడపా, దడపా ఒకటీ అరా..వర్మ మాట్లాడుతున్నా ఏదో ఇబ్బందిగా కదులుతున్నట్లు నేను గమనించాను.

మిసెస్ వర్మ మితభాషి అని తెలుసుకోవటానికి ఎక్కువసేపు పట్టలేదు. మా ఆవిడ మాట్లాడుతూనే వుంది కానీ ఆ వాతావరణం ఆమెకంతంగా నచ్చలేదని నాకు బాగా అర్థమయింది.

"మీరు కూడా వీలు చూసుకుని మా ఇంటికి రండి" సుమిత్ర నన్ను ఉద్దేశించి.

"వస్తాం వర్మా, వస్తామండీ" వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని తిరిగుముఖం పట్టాం.

* * *

కనుచూపు మేరలో ఆటో కనపడలేదు. మెయిన్‌రోడ్డు దాకా నడిచాం. ఆటో స్టాండ్ అక్కడే ఉంది.

నేను అటు నడవబోయాను. ఇంతలో సుమిత్ర "అయ్యో, నా కళ్ళద్దాలు వాళ్ళింట్లోనే మరిచి పోయానండీ. ఇప్పుడెలా?" అంది.

"నువ్వు మళ్ళీ అంత దూరం ఏం నడుస్తావ్. ఇక్కడే ఉండు. నేను గబగబా వెళ్ళి తెస్తా" అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండా వెనుదిరిగాను.

'హమ్మయ్య!' వర్మ ఇల్లు వచ్చేసింది. చక చకా నడిచాను. ఆశ్చర్యం! వర్మ గొంతు గట్టిగా వినిపిస్తోంది. అసలు వర్మ అంత గట్టిగా మాట్లాడగా నేనింతవరకు వినలేదు.

"ఇల్లు నీట్‌గా ఉంచమని నీకెన్నిసార్లు చెప్పాను. వాళ్ళొచ్చేసరికి చూడు. ఇల్లు సంతలా ఉంది. మిసెస్ రావు ఇంటిని ఎంత చక్కగా ఉంచుతుందో తెలుసా. ఏమనుకుంటారో మనల్ని చూసి. ఛీ! ఛీ! నీకసలు ఇంటిని నీట్‌గా సర్దడమే రాదు"

"ఇది బాగుంది. తీరుబడిగా ఉంటే ఎంత బాగా అయినా ఉంచుకోవచ్చు. నాకు మిగిలేది ఒక్క ఆదివారం. అయినా వీలయినంత వరకు సర్దుతూనే ఉంటాను. పిల్లలు మళ్ళీ అన్నీ తీసి పడేస్తూ ఉంటారు. ఏంచేస్తాం" మిసెస్ వర్మ గొంతు.

నేను ముందుకు అడుగు వేయలేక అక్కడే ఆగిపోయాను.

**"ఇల్లంటే పిల్లల మూలంగా అలా ఉందన్నావ్. నీకేమయింది? నీట్‌గా తయారై ఉండలేవూ. నలిగిన చీరె. ఆ ముడి. జిడ్డుముఖం".**

**అంతలో మిసెస్ వర్మ అడ్డుకుంది.**

**"ఆపండి అర్థంలేని మాటలు. ఇంట్లోనే కదా ఉందని కాటన్ చీరె కట్టుకున్నాను. కాస్త నలిగింది. విసుగ్గా ఉండి జడ వేసుకోలేదు. అయినా నేనెలా ఉంటే ఏంటి? వాళ్ళెవరో రావటం ఏమిటి? మీరు నా మీద విరుచుకుపడటమేమిటి? ఇది ఇల్లు. సినిమా సెట్టింగ్ కాదు" అంటూ ఆగింది.**

సుమిత్రను ఒక్కదాన్నీ వదిలేసి వచ్చానన్నది గుర్తుకొచ్చి మొహమాటాన్ని పక్కకు నెట్టి గబగబా ముందుకెళ్ళాను.

వాళ్ళిద్దరూ నన్ను చూసి ఆశ్చర్యపోయారు. "సుమిత్ర స్పెక్ట్స్ మర్చిపోయింది. అందుకని" సంజాయిషీగా చెప్పాను.

"అరె! అలాగా!" అంటూ మిసెస్ వర్మ టేబుల్ మీదున్న కళ్లజోడు తీసి అందించింది. వాళ్ళ సంభాషణ నేను విన్నానేమో అన్న సందేహం వాళ్ళ కళ్ళల్లో కనిపించినా నేను అది గుర్తించనట్టే నటించి " వస్తా వర్మా" అంటూ వెనుదిరిగాను.

* * *

నన్ను చూస్తూనే "ఇంతసేపు పట్టిందే" అడిగింది సుమిత్ర.

"వాళ్ళ బాబు కళ్ళజోడు తీసినట్టున్నాడు. వెతికే సరికి కొంచెం లేటయింది". జరిగింది చెప్పకుండా ప్రమాదం లేని అబద్ధాన్ని జోడించాను.

ఆటో పిలిచి, ఎక్కి కూర్చున్నాం.

సుమిత్ర మొదలుపెట్టింది.

"అబ్బబ్బ! ఏం ఇల్లండీ అది. ఆ బొమ్మలు, పుస్తకాలు ఎక్కడంటే అక్కడ. అసలలా ఉంటే ఎలా తోస్తుందో. మిసెస్ వర్మ ఉద్యోగం చేస్తోందన్నారు. కానీ నాకా లక్షణాలు ఆవిడలో ఎక్కడా కనిపించలేదు. అంతా ముక్తసరిగా మాట్లాడటమే. మనిషి కూడా అదో లోకంలా ఉంది. వర్మ ఎలా భర్తిస్తున్నాడో!

నాకు నవ్వు వచ్చింది. "నేను నిన్ను భరించడంలా" పెదవుల చివరదాకా వచ్చిన మాటని అదిమిపట్టాను. ఆ మాట పెదవి దాటితే సివిల్‌వార్‌కు సిగ్నల్ ఇచ్చినట్లే అని నాకు తెలుసు.

అయినా సుమిత్ర వేటి గురించి మాట్లాడి ఉంటుందో నాకు తెలుసు. లేటెస్ట్ చీరెలు, ఫ్యాషన్లు, సినిమాలు ఇవే తన పరిధిలోని టాపిక్స్. ఇల్లు, మనుషులు నీట్‌గా, అప్డేటెడ్‌గా ఉండటమే. సుమిత్ర దృష్టిలో కల్చరల్‌కు కొలబద్ద. మనిషిలోని మనస్సును అర్థం చేసుకోవడం, ప్రపంచాన్ని [illegible]డం వంటి పదాలకు సుమిత్ర డిక్షన[illegible]టే లేదు.

"ఇల్లొచ్చేసింది"

సుమిత్ర గట్టిగా అనడంతో ఉలికిపడి ఆటో దిగాను. సుమిత్ర గబగబా లోపలకి వెళ్ళింది. నేను ఆటో ఫేర్ చెల్లించి మెల్లిగా కదిలాను.

**నాకింకా వర్మ దంపతులు ఘర్షణ పడడమే మళ్ళీ గుర్తుకు వస్తోంది. సుమిత్ర మాత్రం తన పాటోలా పట్టు చీరెను జాగ్రత్తగా మడతపెట్టి, నగలు, మార్చుకుంటోంది నిశ్చింతంగా.**


**చర్మపు మచ్చలు + కొత్త అన్వేషణ**

ప్యాచ్‌క్యూర్ వైద్యము          మచ్చలు పోగొట్టు తేలిక మార్గము

ప్యాచ్‌క్యూర్‌వైద్యము - సంవత్సరాలుగా పరిశోధించి ఎక్స్‌పెరిమెంట్లు మరియు టెస్టులు చేసి నాణ్యత గుర్తించిన తర్వాత రకరకములైన రంగుల మచ్చలుగల అనేకమందిపై 2 నుండి 8 వారములు ప్రయోగించటమైనది. ప్రయోగముచే రంగుమారుట, మచ్చలు పోగొట్టబడి అసలు చర్మము రంగులోనికి మారుట లాంటి అద్భుతమైన గుణములు రికార్డు చేయటమైనది. దీని సరాసరి ప్రభావము చర్మము మరియు రంగును గ్రహించు కణాలపై ఉండుటచే ప్రయోగము మొదలైన వెంటనే ప్రభావము కనబడును మరియు ఏరంగు మచ్చలైననూ తేలికగా తొందరలో మానగలవు. ఎరుపు, నలుపు, తెలుపు లేక ఏ ఇతర రంగు మచ్చలచేనైననూ బాధపడువారు కేవలము 15 దినములు మాత్రమే ఉపయోగించండి మరియు తీక్షణమైన ప్రభావమును చూడండి. పొందుటకు :- వయస్సు, మచ్చరంగు మరియు ఏ భాగముపైనున్నదీ వ్రాసిపంపుట తప్పనిసరి.

**NATH AYURVEDASHRAM (A-4), P.O.KATRI SARAI (GAYA) 805105**



**1997 సంవత్సర మీ రాశి ఫలాన్ని ఫ్రీగా పొందండి**

మీ భవిష్యత్తు ఎలా ఉన్నది, ఏంజరుగనున్నది, ప్రత్యేకించి 1997 సంవత్సరము మీకు ఎలా ఉంటుంది. ఏ గ్రహము యొక్క ప్రభావము మీపై ఎలా ఉంది. మీరు సంకల్పించిన పనులు ఎప్పుడు, ఎలా నెరవే[illegible] మొ॥ విషయాలు తెల్సుకోవాలనుకుంటున్నారా? మీ పేరు, రాశి, [illegible]క్షత్రం, మీకు ఇష్టమైన పువ్వు పేరు వ్రాసి పంపండి. అన్ని సమస్యలకూ పరిష్కారం లభించగలదు. వెంటనే ఉత్తరం వ్రాసి మీ భవిష్యత్తు ఫలాన్ని ఫ్రీగా పొందండి.

**MAHARANI JYOTISAALA**
(P.O.) Lalbigha (Gaya) B/R.



100% గ్యారంటీగల రివాల్వర్ పంపుతాము
కొత్త టెక్నాలజీ - లైసెన్సు అవసరములేదు.

**6 రౌండ్ ఆటోమేటిక్ రివాల్వర్ 200 షాట్స్, మరియు ఒక కేసు ఉచితం. పిక్నిక్, డ్రామా, ఫిలిం షూటింగ్, టూర్‌లకు ఉపయోగకారి. క్రూర జంతువుల బారి నుంచి తప్పించుకోవచ్చును. బ్రహ్మాండమైన ధ్వనితో పొగ వెదజల్లే రివాల్వర్. రేటు రూ. 255/-. పోస్టేజి, ప్యాకేజి రూ. 30/- అదనం: వి.పి. ద్వారా పంపమని అడగండి.**

**WESTERN INDIA COMPANY( )**
P.O. Maira Barith (Gaya) 805105